కథ

# మేడ్ఫరచదర్

• అల్లూరి గౌరీలక్ష్మి •

ఘుమ్ ఘుమాయించు కొంచెం' అంటూ రెండు స్పూన్ల నెయ్యి వేడన్నం మీద వేసుకుని గోంగూర పచ్చడి కలిపి 'అబ్బ... ఏం రుచిగా ఉందీ?' అన్నాడు ఆనందరావ్ భార్యతో

"పచ్చడి బాగా కుదిరిందా" అడిగింది భార్య కల్యాణి.

"ఎంత బావుందంటే నువ్వు మొదటి రాత్రి పాలగ్లాను పట్టుకుని నించున్నంత బావుంది" తన్మయంగా అన్నాడు ఆనందరావ్.

"ఏడ్చినట్టుంది మీ పోలిక. పచ్చడికి పెళ్ళానికీ పోలికేంటి?" చిరుకోపంగా అంది కల్యాణి.

"అవును. పచ్చడి కలుపుకు తింటాం. పెళ్ళాన్ని కొరుక్కుతింటాం"

"చాల్లెండి. పిల్లలు వింటారు" డైనింగ్ టేబుల్‌పై గిన్నెలు సర్దుతూ అంది. అప్పుడు చూశాడు అమె వైపు. పాపిట్లో మొదట కుంకుమ, ఆ వెనుక ఏమిటది తెల్లగా కనబడుతూంది.

"ఏమిటోయ్ నీ పాపిట్లో? పౌడర్ కానీ పడిందా?" అడిగాడు.

"అమ్మయ్యో... చూసేశారా... పాపిట్లో కొన్ని వెంట్రుకలు తెల్ల బడుతున్నాయ్" అంది క్యాజువల్‌గా నవ్వుతూ.

"ఏమిటీ... తెల్ల వెంట్రుకలా? ముప్ఫయి అయిదేళ్ళకే?"

"ఏం రాకూడదా?"

"మరి నాకు రోజూ కనబడట్లేదే?"

"తలస్నానం చేసిన రోజున కనబడుతున్నాయి. నూనె రాయగానే కనబడవు. అంటే స్టార్టింగ్ అన్నమాట. పెద్దవాళ్ళ వుతున్నారని వార్నింగ్."

"నీకు బాధగా లేదూ... అంత ఈజీగా ఎలా అనగలుగుతున్నావ్?"

"బాధెందుకు. రాధికి. పదేళ్ళునిండుతున్నాయి. ఇంగా మనం కుర్ర వాళ్ళమా?"

అతనికి అన్నం రుచి పోయినట్లనిపించింది. భోజనం త్వరగా ముగించి ఆఫీస్‌కు బయలు దేరాడు. వచ్చిన కాలనీ బస్సెక్కి నీరసంగా సీట్లో కూర్చున్నాడు. ఆలోచనలు చుట్టుముట్టాయి. మూడ్ ఆఫ్ అయినట్లనిపించింది. అయిపోయింది. తన యవ్వనం కరిగిపోయింది. ఇంకేం మిగిలింది జీవితంలో ఆనందం. అయినా కల్యాణి తనకంటే రెండేళ్ళు చిన్నది. అప్పుడే తెల్ల వెంట్రుకలెలా వచ్చేశాయబ్బా. అతనికి చటుక్కున కల్యాణిపై ఆ తర్వాత స్త్రీజాతిపై



కోపమొచ్చింది.

అసలీ ఆడవాళ్ళు గబుక్కన ముసలాళ్ళయి కూర్చుంటారు. అసలు వాళ్ళకి మెంటల్ మెచ్యూరిటీ జాస్తి. చిన్నప్పటి నుండీ పైట లేసుకుని ఆటలాడుకుంటారు. వాళ్ళ బుర్రల్లోనే పుట్టినప్పటి నుండీ ముసలి బుద్ధులుంటాయి. వాళ్ళకి కళాత్మక దృక్పథం బహు తక్కువ. అందులో కల్యాణి లాంటి స్త్రీలకు మరీనూ. పెళ్ళి కాక ముందు ఓ రెండు మూడేళ్ళు కా... ముస్తాబవుతారు. పెళ్ళయ్యాక ఇంకొక్క సంవత్సరం మొగుణ్ణి లోబర్చు కోవడం కోసం సీతాకోకచిలుకల్లా తయారయ్యి వయ్యారాలు

## కథ

వలకబోస్తారు. అంతే... ఇంక వేవిళ్ళ సీజన్ ప్రారంభం. కావడంతో ఒరిజనల్ గెటప్పు కొచ్చేస్తారు. మంచం పట్టుకుని వదలరు నీరసం అంటూ. పుట్టింటి వాళ్ళు ఎగురుకుంటూ దిగ బడతారు. పిల్లని అల్లుడెంత కష్టపెడుతున్నాడో అన్నట్టు ఫిలింగ్స్ పెట్టుకుని తెగ అపురూవ పడిపోయి. "అమ్మాయి చేసుకోలేదు బాబూ" అంటూ నంగివేషాలేస్తూ కూతుర్ని తీసుకు పోతారు. ఓ రెండు మూడు నెలలు ఈవిడగారక్కడ రెస్ట్ లాగించి బుట్టెడు మందులు, టానిక్కులతో తిరిగొస్తుంది. డాక్టర్ చెకప్పులంటూ, మొగుణ్ణి బాడీ గార్డుగా చేసుకుని హాస్పిటల్‌కి తిరుగుతూ పళ్ళూ, పాలూ సేవిస్తూ ఆయాస పడుతుంటుంది. మొగుడి గురించేమీ పట్టించుకోదు. వాడి సరదాలూ, సంతోషాలూ కట్టు. మరో మూడునెల్లకి పుట్టింటి గాంగ్ మళ్ళీ దిగుతుంది. 'తొలి కానుపు' అంటూ నాలుగు సున్నుండలూ, నాలుగ్గు మిఠాయిలూ మొహాన కొట్టి కూతుర్ని తీసుకుపోతారు అల్లుడి వెధవ బతుకేంటి? ఎక్కడ తింటాడు? ఎలా ఉంటాడు? అని ఆలోచించను కూడా ఆలోచించరు. ఎక్కడన్నా చావనీ... వాడు చేసిన పనికి వాడికదే శాస్తి అన్నట్టు చూస్తారు.

ఇంక ఈ మహాతల్లులు ఓ పిల్లని కనగానే ప్రమోషన్ రాగానే ముందు కేడర్ వాళ్ళని మర్చి పోయినట్టు ఏదో హోదా వెలిగించుకుని మొగు ణ్ణసలు కేరే చెయ్యరు. ఆ పుట్టిన పిల్లాణ్ణి చంకనేసుకుని ఏ అయిదో నెలలోనో దిగుతారు. ఆ రోజు కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న మొగుడు గాడికి ఏం మిగులుతుంది? అంతా హుళక్కి. రోజంతా చంటాడికి పాలివ్వడం, గుడ్డలుతకడం, వాడి నవ్వులు చూసి మురిసి పోవడం, వారి అల్లరి చూసి వీరమాతలా పొంగి పోవడం. మొగుడి గొడవేమన్నా ఉంటుందా? ఉండదు కాక ఉండదు. వాడి సరదాలన్నిటికీ మంగళహారతి. ఆ చిన్న రాక్షసుడి సేవతోనే తల్లికి తెల్లవారుతుంది.

అసలీ ఆడవాళ్ళకి మొగుడనే వాడు ఒక ప్రొటెక్షన్ కోసం, సోషల్ సెక్యూరిటీ కోసం తప్ప మరిక దేనికీ కాదు. కొన్నాళ్ళు సొగసు లొలక బోసి పని పూర్తి కాగానే పిల్లలు మీదే ధ్యానంతా పెట్టుకుంటారు. "ఆ చీర కట్టకోవే... ఈ బొట్టు పెట్టుకోవే!" అంటే "ఉండండీ. మీరాఫీసుకి వెళ్ళిపోతారు హాయిగా. రోజంతా వీడెంత అల్లరి చేస్తున్నాడో మీకేం తెలుసు? వీణ్ణి చూసుకునే సరికి సాయంత్రానికి నాకు ఓపిక ఉండట్లేదు" అంటూ పోజులు. ఇక మొగుడనే శాల్తీ ఈవిడకీ, ఈవిడ సంతానానికీ పోషకుడు కాబట్టి ఏదో కృతజ్ఞత కొద్దీ రెండు పూట్లా తిండి మాత్రం పడేస్తారు. ఏదో పిల్లలు పసివాళ్ళు కనక అంత కేర్ తీసుకుంటోందేమోలే పాపం అని మొగుడు ప్రాణి అపోహపడి బతుకుతుంటాడు భవిష్యత్తుపై ఆశతో.

పిల్లలు కాస్త పెద్దదయిన దగ్గర్నుంచీ ఆ పిల్ల మూకల అల్లరి, పేచీలు, కాన్వెంట్లూ, బూట్లూ, ట్యూషన్లు వాటితో సరిపోయిందంటుంది. పిల్లల పెళ్ళిళ్ళ గురించీ వాళ్ళ ఉద్యోగాల గురించీ ఆశా సౌధాలు కడుతూ ఉంటుంది తప్ప అప్పుడైనా భర్తను గురించీ బాధ పడిన పాపాన పోదు. ఇదిగో సరిగ్గా ఇలాగే ఆలోచించి ఆలోచించి ఆడవాళ్ళంతా చటుక్కున ముసలాళ్ళైపోతారు.

నాయనమ్మ నా పెళ్ళికి ఎంతో మొత్తుకుంది. వయసులో తోడా మరీ రెండేళ్ళు బావోదనీ కనీసం అయిదారేళ్ళుండాలనీ. "మీ తాత గారికీ



నాకు పదేళ్ళు తేడా అయినా ఆయనే నాకంటే చిన్నగా కనిపించేవారు. మగాడు యాభై ఏళ్ళొచ్చే వరకూ యువకుడే. ఆడవాళ్ళే ముప్ఫయ్యేళ్ళకే ముసలమ్మలవుతారు'' అని నవ్విగింది. అమ్మ కళ్ళెర్ర జేసేసరికి నాయనమ్మ పాపం నోర్మూసుకుంది. చచ్చి ఏ లోకాన్నుందో గానీ ఎంత ముందు చూపుతో ఆలోచించింది... అందుకే పెద్దల మాట చద్ది మూటన్నారు.

బస్ ఆగడంతో ఆలోచనలాపి ఆఫీస్‌కి నడిచాడు. పనిలో మునిగిపోయి తన సమస్య తాత్కాలికంగా మర్చిపోయాడు. తిరుగు ప్రయాణంలో మళ్ళీ ఆలోచన మొదలెట్టాడు. బుర్ర పాడు చేసుకునేకంటే రెమిడీ ఆలోచించడం మంచిదనిపించింది.

బస్ దిగి తిన్నగా ఫాన్సీ షాప్‌లోకి నడిచాడు. హెయిర్ డై కొన్నాడు. ''కల్యాణి నీకో గిఫ్ట్'' అంటూ చేతిలో బాటిల్ పెట్టాడు. ''ఏదీ డాడీ'' అంటూ పెద్ద కూతురి రాధీ లాక్కుని చదివింది. 'మమ్మీకా?' అడిగింది.

''అవును. నువ్వు లోపలున్న ఇన్‌స్ట్రక్షన్స్ అన్నీ చదివి మీ మమ్మీకి డై వేసి నాకు చూపించాలి నేను ఓ.కే. అన్నాననుకో అందరం సండే డిన్నర్‌కి హోటల్‌కెళ్దాం'' అని ప్రామిస్ కూడా చేసేశాడు.

''ష్యూర్ డాడీ! నాదే బాధ్యత'' అంటూ రాధీ హామీ ఇచ్చింది.

''రేపొద్దున్నే ఈ పని చెయ్యాలి.''

''అలాగే డాడీ...''.

★ ★ ★ ★ ★

ఎనిమిది గంటలకి లేచాడు ఆనందరావు. ''ఏమయిందోయ్ నీ కేశ సంరక్షణ'' అడిగాడు కాఫీ తాగుతూ.

''సారీ అండీ. ఆ డై నా వంటికి పడదనుకుంటా. కొద్దిగా నా చెవి వెనక రాసి టెస్ట్ చేసిందండీ అమ్మాయ్. అక్కడ ఒకటే మంట. దురద మొదలయ్యాయ్. అంటే నాకు పడదన్న మాటేగా'' అంది దిగాలుగా.

నిశ్శబ్దంగా తన పనులు ముగించి ఆఫీసుకు బయలుదేరాడు. బస్‌లో కూర్చుని మళ్ళీ దిగులు పడడం ప్రారంభించాడు. అయిపోయింది. ఆఖరి ఆశ కూడా చచ్చింది. నేనింక బలవంతంగా నోరు నొక్కుకుని ముసలితనానికి స్వాగతం చెప్పవలసిందే. అసలు పెళ్ళయినప్పుడు తమ జంట. 'చిలకా గోరింకల్లా ఉంద'ని అనేవారు. ఆఫీసు వాళ్ళు కూడా తమ జంటని చూసి 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అని ఏకగ్రీవంగా ఆమోదించారు. తమ జంటని • తల్చుకుని తనెంతో గర్వపడేవారు.

ఆఫీసులో నలుగురాడవాళ్ళ మధ్య తన సీటు. తనని నారీ నారీ నడుమ మురారి అని తోటి వాళ్ళు ఈర్ష్య పడుతుండడం కూడా కద్దు.

## ఏమిటి?

## తెల్ల వెంట్రుకలా?

## ముప్ఫయి ఐదేళ్ళకే?

## ఏం రాకూడదా?

తనసలు ఎప్పుడూ నీట్‌గా ఇన్‌షర్ట్ చేసుకుని చిరునవ్వుతో ఉంటుంటాడు.

''మీరసలు బాచిలర్ అనుకున్నానండీ ఆనంద్ గారూ జాయినయినప్పుడు'' అని కొత్త టైపిస్టు పోరి అన్నప్పుడు తానెంతో మురిసిపోయాడు. ఎవర్ గ్రీన్ అని కూడా అనిపించుకున్నాడు. అలాంటి భోగం అంతా పోయింది. ఏ ఆఫీసు వాళ్ళు ఇంటికొచ్చినప్పుడో, కొలీగ్స్ ఇళ్ళకి శుభకార్యాలకి వెళ్ళినప్పుడో నా వెంట కల్యాణిని చూసి ఆనంద్ గారి పెళ్ళాం ముసల్ది అంటే ఈయన కూడా ముసలాడే. ఏవో షోకులు చేసుకుని అలా అవుపిస్తాడంతే అని తన ఆఫీసు ఆడవాళ్ళంతా అనుకోవడం ఖాయం. ఇంకేముంది? తనెంత స్మార్ట్‌గా తయారయ్యి ఏం ప్రయోజనం? గుండె బరువెక్కింది ఆనంద్‌కి. హు... బతుకంటే ఇంతే కదా.... బస్ దిగి ఆఫీసుకి నడిచాడు.

వారం గడిచింది. ఆనంద్‌రావు మెల్లగా గుండె రాయి చేసుకుంటున్నాడు. మనిషి హుషారుగా ఉండలేకపోతున్నాడు. అయినా ఏం చేయగలడు పాపం బాధని జీర్ణం చేసుకోవడం తప్ప.

''ఏదీ అద్దం తీసుకు రామ్మా చూద్దాం'' అన్నాడు మృదువుగా కంగారు కనబడనివ్వకుండా. పరీక్షగా అద్దంలో చూసుకున్నాడు. నాలుగైదు కంట బడ్డాయి. అటూ ఇటూ చూశాడు. కల్యాణి వంటింట్లో బిజీగా ఉన్నట్టుంది.

ఓ రోజు ఆదివారం. తలస్నానం చేసి వరండాలో కుర్చీ వేసుకుని పేపర్ చదువుతున్నాడు. చిన్నకూతురి ఏడేళ్ళ చిట్టి వళ్ళో చేరింది. మెల్లగా తల సర్దడం మొదలుపెట్టి ''డాడీ... నీక్కూడా మమ్మీలాగానే వైట్ హెయిర్స్ ఉన్నాయి'' అంది ముద్దు ముద్దుగా. ''ఈజిట్'' గతుక్కున్నాడు.

''చిట్టీ... నువ్వు నా వెనక నిలబడి మొత్తం ఎన్ని వైట్ హెయిర్స్ ఉన్నాయో చూడమ్మా'' అని బ్రతిమాలాడు.

''సరే డాడీ...'' అంటూ చిట్టి తన బరువంతా తండ్రి మీద వేసి పది నిముషాలు లెక్క పెట్టింది. ''మొత్తం థర్టీ ఫైవ్ డాడీ'' అంది ఆయాసపడుతూ. ''వెరీ నైస్ గాళ్'' అంటూ చిట్టికి ముద్దిచ్చి ''నువ్వు బైటికెళ్ళి ఆడుకో నాన్నా'' అని పంపేశాడు.

కుర్చీలో రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడు. అతనికిప్పుడు కొండంత భారం దిగినట్టుంది. ఏమయితేనేం ''మేడ్ ఫర్ ఈచ్ అదర్'' అన్న మాట సార్థకం అయ్యిందీ రోజుతో. అతనికిప్పుడు గొప్ప స్థిమితంగా ఉంది. మనసుకు ఊరట కలిగింది. వారం రోజుల తర్వాత మునుపటి ఆనందరావ్‌గా మారిపోయాడు. ''జగమే మారెనుగా మధురముగా'' పాటను హమ్ చేసుకుంటూ వంటింట్లో పెళ్ళాంతో బాతాఖానీ వెయ్యడానికి బయలుదేరాడు చిరునగవుతో

## డియర్ ఫ్రెండ్!

స్నేహం చాలా గొప్పది! చదువుకునే రోజుల్లో ఎందరో స్నేహితులుంటారు. ఉద్యోగరీత్యా ఊళ్ళు మారడంలో ఎవరెక్కడున్నారో మరచిపోతాం.

మీ పాత స్నేహితులను మయూరి ద్వారా కలుసుకోండి.

మీ స్నేహితులకు పది లైన్లు మించకుండా ఉత్తరం రాయండి. వారు మిమ్మల్ని గుర్తుపట్టేందుకు ఫోటో కూడా పంపండి. తిరిగి మీకు రిప్లయి ఇచ్చేందుకు మీ చిరునామా స్పష్టంగా రాయండి.

మీ మిత్రులను పలకరించాల్సిన చిరునామా—

డియర్ ఫ్రెండ్!
కేరాఫ్ మయూరి
5–8–55/ఏ,
నాంపల్లి స్టేషన్ రోడ్,
హైదరాబాద్